క్లుప్తంగా

సంజీవయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



నెల్లూరు(వేదాయపాళెం): నగరంలోని వసంతోపు సెంటర్‌లో మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య కాంశ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, కర్నూలు జిల్లాకు ఆయన పేరు పెట్టాలని ఆ విగ్రహ కమిటీ చైర్మన్ పల్లం వెంకయ్య డిమాండ్ చేశారు. దర్గామిట్టలోని అంబేడ్కర్ భవన్‌లో దామోదరం సంజీవయ్య 104వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. సంజీవయ్య చిత్రపటానికి దళిత సంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. బీసీ నేత రఘురాంముదిరాజ్, దళిత నేతలు బాలసుధాకర్, సాయిరాం, వెంకటసుబ్బయ్య, కుడుముల సుబ్బారావు, మహేష్, సురేష్, నిర్మలమ్మ, ప్రమీలమ్మ, కిరణ్మయి పాల్గొన్నారు.

మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



నెల్లూరు(వేదాయపాళెం): మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలనే డిమాండ్‌తో వచ్చే నెలలో నగరంలో మాదిగల రాజకీయ గర్జన నిర్వహించనున్నట్లు మన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లాల శ్రీనివాసులు తెలిపారు. దర్గామిట్టలోని అంబేడ్కర్ భవన్‌లో మన ఎమ్మార్పీఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని, మాదిగ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మన ఎమ్మార్పీఎస్ లీగల్ అడ్వైజర్ శ్రీరాం మురళీకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్ధవరపు పెంచలయ్య, మహిళాధ్యక్షురాలు పల్లాల సునీత, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఆదూరి రత్నం, శ్రీనివాసులు, కాకులూరు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



నెల్లూరు(క్రైమ్): ఎమ్మెస్సార్ సేవా సమితి ఆధ్వర్యంలో నగరంలోని గీతామయి వృద్ధాశ్రమంలో బుధవారం అన్నదానం చేశారు. వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. సేవా సమితి వ్యవస్థాపకుడు మాగుంట శరత్చంద్రారెడ్డి వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని సేవా సమితి సభ్యులు తెలిపారు. సేవా సమితి సభ్యులు సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పీసీరెడ్డి సమాజ మందిరంలో..

నెల్లూరు(బృందావనం): పడారుపల్లి, దివ్యాంగుల కాలనీలోని ఆచార్య పీసీరెడ్డి సమాజ మందిరంలో క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో దివ్యాంగులు, వృద్ధులు, మహిళలు, నిరుపేదలకు బుధవారం అన్నదానం చేశారు. హరనాధపురానికి చెందిన ఇప్పగుంట పార్థీవ్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని తల్లిదండ్రులు ఇప్పగుంట శివకుమార్‌రెడ్డి, నీరజ దంపతులు అన్నదానం చేసినట్లు వెంకటలక్ష్మి తెలిపారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఈదూరు గోపీనాథ్‌రెడ్డి, నిఖిత్‌రెడ్డి, శారదమ్మ, దగ్గుపాటి రాధాకృష్ణ, అట్ల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ



నెల్లూరు సిటీ: ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కుమారుడు రానా ప్రమోద్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలోని ఎంఎస్సార్ స్పాస్టిక్ సెంటర్ చిన్నారులకు బుధవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రమోద్‌రెడ్డి మాట్లాడుతూ స్పాస్టిక్ సెంటర్ చిన్నారులతో జన్మదినాన్ని జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. సెంటర్‌కు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ సతీమణి ప్రవీణ, దాసరి రాజేంద్రప్రసాద్, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీపూజ



నెల్లూరు రూరల్: వసంత పంచమి సందర్భంగా కొత్తూరు పరిధిలోని శ్రామికనగర్‌లోని ఎస్వీఎస్ పాఠశాలలో బుధవారం సరస్వతీ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కరస్పాండెంట్ వెంకటేశ్వర్లురెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు ప్రసాదాలను పంచిపెట్టారు. స్కూల్ ఇన్‌చార్జి పీ గౌరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీపంచమి

నెల్లూరు(బృందావనం): చదువుల తల్లి సరస్వతీదేవి జన్మదినం శ్రీపంచమిని పురస్కరించుకుని నగరంలోని వివిధ ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. సంప్రదాయంగా చిన్నారులతో ''ఓం నమశ్శివాయ సిద్ధం నమః''అని రాయించారు. రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వంశపారంపర్యధర్మకర్త ఆర్ జయరామ్, శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి సేవా సమితి అధ్యక్షుడు ఎస్ పెంచలరెడ్డి, ఈఓ వెంకటశ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో సరస్వతి అమ్మవారి చెంత అక్షరాభ్యాసం నిర్వహించారు. బాలాజీనగర్ బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కురువాడ లలితమ్మ కల్యాణ మండపంలో శ్రీతిక్కన మహాకవి లలితకళాపీఠం వ్యవస్థాపకులు ఆలూరు శిరోమణిశర్మ చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ బ్రాహ్మణసేవాసంఘం నిర్వాహకులు ఎస్ భవానీప్రసాద్, శ్రీరామమూర్తి, రవికుమార్, పీ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం



రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ..



శ్రీకురువాడ లలితమ్మ కల్యాణమండపంలో..

బేటీ బచావో..బేటీ పడావోపై కళాజాత



ప్రచార రథాన్ని జెండాఊపి ప్రారంభిస్తున్న ఐసీడీఎస్ పీడీ హేనసుజన్

నెల్లూరు(వేదాయపాళెం): బేటీ బచావో..బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాలు, మానవ అక్రమరవాణ, బాలలు, మహిళలపై లైంగిక వేధింపులు తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు కళాజాత నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ బీ హేనసుజన్ తెలిపారు. దర్గామిట్టలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద బేటీ బచావో..బేటీ పడావో ప్రచార రథాన్ని బుధవారం ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ కళాజాత బృందం ప్రతి గ్రామంలో తిరిగి బుర్రకథ, నాటికలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా మహిళా రక్షణ చట్టాలపై ప్రజలకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ మూడు గ్రామాల చొప్పున మూడు నెలల పాటు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓలు అనురాధ, లక్ష్మి, జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు,.

దత్త విజయానందతీర్థస్వామికి పూర్ణకుంభ స్వాగతం

నెల్లూరు(బృందావనం): మైసూరు అవధూత దత్తపీఠ ఉత్తరాధీశ్వరులు దత్త విజయానందతీర్థస్వామి నెల్లూరు సుజాతమ్మకాలనీలోని శ్రీకృష్ణయోగ మందిరానికి బుధవారం ఆగమనం చేశారు. మందిర నిర్వాహకులు ఎస్‌జీఎస్‌కేజీబీఎస్ ట్రస్ట్ ఎగ్జిక్యూటీవ్ ట్రస్టీ సర్వేపల్లి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ట్రస్టీలు సంప్రదాయంగా పూర్ణకుంభంతో స్వామిని ఆహ్వానించారు. అనంతరం స్వామి మందిరంలోని కొలువైన శ్రీకృష్ణపరమాత్మ, అష్టలక్ష్మి, ఆంజనేయస్వామి, శివాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రాంగణంలో ఆధునీకరించిన శ్రీరాధాకృష్ణ ధ్యానమందిరాన్ని భక్తుల సమక్షంలో ప్రారంభించారు. ట్రస్టీలు అనపల్లి, అశోక్‌కుమార్‌రెడ్డి, రేబాల పట్టాభిరామిరెడ్డి, రాజశేఖర్, సురేష్, సీసీ రత్నం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



దత్త విజయానందతీర్థస్వామితో ట్రస్ట్ సభ్యులు

నకిలీ పురుగు మందులు విక్రయిస్తే చర్యలు

నెల్లూరు(సెంట్రల్): నకిలీ పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సహాయ వ్యవసాయ సంచాలకులు నందం శ్రీనివాసులు హెచ్చరించారు. నెల్లూరులోని పురుగు మందుల దుకాణాల్లో బుధవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. రికార్డులను తనిఖీ చేసి స్టాక్ నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ నకిలీ, నాసిరకం, కాలం చెల్లిన,ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరలకు మందులు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి పత్రాలు లేకుండా మందులు విక్రయిస్తే శిక్ష తప్పదన్నారు. రైతులకు బిల్లులు తప్పకుండా ఇవ్వాలన్నారు. ఆయన వెంట ఏఓ నాగమోహన్ ఉన్నారు.



దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీ శ్రీనివాసులు

పండుటాకులుకు జ్యూరీ అవార్డు

నెల్లూరు(బృందావనం): అనంతపురంలో జరిగిన ఆరో జాతీయ షార్ట్‌ఫిల్మ్స్ పోటీల్లో కళాంజలి క్రియేషన్స్ వారి పండుటాకులు లఘుచిత్రానికి జ్యూరీ అవార్డు లభించిందని కళాంజలి అనంత్ బుధవారం తెలిపారు. అలాగే కామెడీ స్కిట్స్ పోటీల్లో కళాంజలి క్రియేషన్స్ ఏటీఎం స్కిట్‌కి ఉత్తమ హాస్య అవార్డు లభించిందని చెప్పారు.

రాష్ట్ర వైఎస్సార్ సేవాదళ్ సెక్రటరీగా ఆర్ఎస్సార్

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం చైర్మన్, 20వ డివిజన్ ఇన్‌చార్జి రావు శ్రీనివాసరావు(ఆర్ఎస్సార్)ను రాష్ట్ర వైఎస్సార్ సేవాదళ్ సెక్రటరీగా నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర సేవాదళ్‌లో చోటు కల్పించిన ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



ఎంపీ ఆదాలకు సన్మానం

నెల్లూరు రూరల్: ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో ఎంఎస్ఎంఈ డైరెక్టర్ పాశం శ్రీనివాస్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ ఆదాలకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ప్రభుత్వం అప్పగించిన పదవీ బాధ్యతలకు వన్నె తేవాలని శ్రీనివాస్‌కు ఎంపీ సూచించారు.



18న పీఈటీ క్రీడా జట్ల ఎంపిక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సదస్సు, క్రీడాపోటీల్లో పాల్గొనే ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల జట్లను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈ నెల 18వ తేదీ ఉదయం 9 గంటల నుంచి ఎంపిక చేయనున్నామని వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, థామస్ పీటర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సును కాకినాడలో ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహించనున్నారని చెప్పారు. పురుషుల విభాగంలో వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, హాకీ, బాల్‌బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్.. మహిళా విభాగంలో త్రోబాల్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్.. మహిళలు, పురుషులకు పరుగుపందేల్లో ఎంపికలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నెల్లూరు రూరల్: పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన దేవరపాళెం గిరిజన కాలనీకి చెందిన పిట్టా చెంచురామయ్య(51) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. వివరాలు.. చెంచురామయ్య మొదటి భార్యను వదిలేసి భర్తను వదిలేసిన మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడు. వీరికి సంతానం లేదు. చెంచురామయ్య చిత్తు కాగితాలు సేకరిస్తూ, కూలి పనులకు వెళుతూ జీవనం సాగించేవాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 11న భార్యను మద్యానికి నగదు ఇవ్వాలని కోరగా ఆమె నిరాకరించింది. దీంతో మద్యంలో పురుగు మందు కలుపుకుని తాగాడు. పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యులు నెల్లూరులోని జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. బుధవారం రూరల్ పోలీసులకు సమాచారం అందడంతో ఆస్పత్రి వద్దకు చేరుకుని విచారించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పశుపక్ష్యాదులను ప్రేమించాలి

నెల్లూరు(బృందావనం):పశుపక్ష్యాదులను ప్రేమించి ఆదరించాలని నారాయణ దంత వైద్యకళాశాల విభాగాధిపతి కణ్ణన్ తెలిపారు. జంతు సంక్షేమ దివస్ సందర్భంగా పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో జంతుప్రేమికుల సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కణ్ణన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మనదేశంలో అన్ని రకాల పశుపక్ష్యాదులను ఆరాధించే సంప్రదాయం ఉందన్నారు. వాటి కోసం ప్రత్యేకంగా పండుగలు చేయడం ఆనవాయితీ అన్నారు. ప్రకృతి సమతుల్యం కోసం సకల జీవరాశులను ఆదరించాలన్నారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు పశుపక్ష్యాదుల సంరక్షణలో భాగస్వామ్యం కావాలన్నారు. ఫౌండేషన్ ఫర్ ఏనిమల్స్ అధ్యక్షురాలు ఉమాదేవి, పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ కోటేశ్వరరావు, జయప్రకాష్, అసిస్టెంట్ డైరెక్టర్స్ మాధవీలత, చైతన్యకిషోర్, వెంకటలక్ష్మి, వినోద్ తదితరులు పాల్గొన్నారు



జంతుప్రేమికుల సదస్సుకు హాజరైన డాక్టర్ కణ్ణన్, డాక్టర్ కోటేశ్వరరావు

సితార ఎంటర్‌టైన్‌మెంట్ కార్యాలయం ప్రారంభం

నెల్లూరు(బృందావనం): నగరంలోని వెంకట్రామపురంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్ కార్యాలయాన్ని 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీరంగంలో రెండు దశాబ్దాలకుపైగా అనుభవం కలిగిన కుమార్ సితార ఎంటర్‌టైన్‌మెంట్ కార్యాలయాన్ని ప్రారంభించడం హర్షణీయమన్నారు. కుమార్ మాట్లాడుతూ సినీరంగంపై ఆసక్తి కలిగిన వారికి శిక్షణ ఇచ్చి నటీనటులుగా అవకాశం కల్పిస్తామని తెలిపారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు నలుబోలు బలరామయ్యనాయుడు, రమణారెడ్డి, పేరూరి ప్రదీప్, దోర్నాల హరిబాబు, ఫిల్మ్ చాంబర్ జిల్లా కన్వీనర్ అనంత్ తదితరులు పాల్గొన్నారు.



సితార ఎంటర్టైన్‌మెంట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అమరావతి కృష్ణారెడ్డి

ఎన్నికల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్

నెల్లూరు(దర్గామిట్ట): ఐదు రాష్ట్రాల కలెక్టర్లు, ఎన్నికల నోడల్ అధికారులతో భారత ఎన్నికల సంఘం బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి కలెక్టర్ ఎం హరినారాయణన్, ఎన్నికల నోడల్ అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నామినేషన్ ప్రక్రియ, చెక్‌పోస్టులు, తనిఖీల్లో పట్టుబడిన నగదు, తదితర విషయాలపై ప్రత్యేక సూచనలు అందజేసింది. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో బాపిరెడ్డి, జెడ్పీ సీఈఓ కేకే నాయుడు, డ్వామా పీడీ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.



రంజీ జట్టుకు రేవంత్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్రికెటర్ రేవంత్‌రెడ్డి ఆంధ్రా సీనియర్ రంజీ జట్టుకు ఎంపికయ్యారని క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ మూర్తి, నిఖిలేశ్వర్‌రెడ్డి బుధవారం తెలిపారు. రాష్ట్రస్థాయిలో గతేడాది అండర్ – 19 విభాగంలో అత్యుత్తమ ప్రతిభను కనబర్చి నాలుగు సెంచరీలు చేసిన రేవంత్‌రెడ్డి రంజీ జట్టుకు ఎంపికవ్వడం జిల్లాకు గర్వకారణమని చెప్పారు. కాగా తొమ్మిదేళ్ల తర్వాత జిల్లా నుంచి రంజీ జట్టుకు క్రీడాకారుడు ఎంపిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.



మార్కెట్లో హోండా యాక్టివాకు ఆదరణ

నెల్లూరు (టౌన్): నగరంలోని శ్రీషిర్డీషా హోండా షోరూంలో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఉద్యోగులకు 30 హోండా యాక్టివా డీలక్స్ వేరియంట్ వాహనాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా జనరల్ హెడ్ జోగారావు మాట్లాడుతూ మార్కెట్లో హోండా యాక్టివా వాహనాలకు ఆదరణ ఉందన్నారు. షోరూం ఫౌండర్ కొండా బలరామిరెడ్డి మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా వారు 30 వాహనాలను కొనుగోలు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీషిర్డీషా హోండా డైరెక్టర్ కొండా నిరంజన్‌రెడ్డి, సీజీఎం రవికుమార్, మేనేజర్లు మీరా మొహిద్దీన్, హరి, వర్క్స్‌మేనేజర్ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ వయస్సు పెంపుపై ధన్యవాదాలు

నెల్లూరు (టౌన్): యూనివర్శిటీలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం జీఓ విడుదల చేయడంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వారు బుధవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. వర్శిటీలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది ఉద్యోగ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని పలుమార్లు మంత్రులు, ప్రభుత్వ పెద్దలకు వినతిపత్రాలు అందజేసినట్లు చెప్పారు. ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి ఉద్యోగ విరమణ వయస్సును పెంచడం సంతోషకరమని పేర్కొన్నారు.

ఆర్ఎంఎస్ పరీక్షలో కొత్తూరు విద్యార్థి ప్రతిభ

నెల్లూరు రూరల్: కొత్తూరు, టీచర్స్ కాలనీకి చెందిన మహమ్మద్‌ఖాన్, బీబీజాన్ దంపతుల కుమారుడు అజమల్‌ఫహీం జాతీయస్థాయిలో జరిగిన ఆర్ఎంఎస్ పరీక్షలో ప్రతిభకనబరిచాడు. దేశ వ్యాప్తంగా ఉన్న ఐదు రాష్ట్రీయ మిలటరీ స్కూల్స్(ఆర్ఎంఎస్)కు సంబంధించి డిసెంబర్‌లో బెంగళూరులో నిర్వహించిన ఆర్ఎంఎస్– 2023 పరీక్షలో ప్రతిభచాటి 9వ తరగతిలో సీటు సాధించాడు. ఈ సందర్భంగా అజమల్‌ఫహీంను పలువురు అభినందించారు.



కాకుపల్లి బిట్-1 గ్రామ పంచాయతీ కార్యాలయము

ఆర్.ఓ.సి. నెం: 01/2024 — **టెండరు నోటీసు** — తేది 15.02.2024

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరురూరల్ మండలము కాకుపల్లి బిట్-1 గ్రామ పంచాయితీ పరిధిలో 12 నెలల కాలము అనగా తేది: 01-04-2024 నుండి 31-03-2025 వరకు గ్రామ పంచాయితీ నందు వివిధ సేవలు నిర్వహించుటకు గ్రామ పంచాయతీకి సిబ్బందిని ప్రతిరోజు పంపవలెను. సదరు సేవల మీద సిబ్బందిని పంపుటకు ఆసక్తి ఉన్న కాంట్రాక్టరు గ్రామ పంచాయితీ నందు టెండరు దాఖలు చేయవలెను. సదరు టెండర్లు దాఖలు తేది 21.02.2024 ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 03.00 వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడును. మరియు అదే రోజు మధ్యాహ్నం గం॥3.00 గంటలకు హాజరైన టెండరు దారుల సమక్షములో సీల్డు టెండర్లు తెరవబడును. టెండర్లు దాఖలు చేయువారు. ఈ క్రింది తెలిపిన విధముగా నిర్ణీత ధరావత్తు పంచాయితీ కార్యాలయములో చెల్లించి రశీదు పొంది, టెండరు షెడ్యూలును ఆతవరలి టెండరు దాఖలు చేయవలెను. షరతులు వర్తించును పై టెండర్లు ఆమోదము తెలుపుటకు తుది నిర్ణయము పంచాయితీ వారిది. టెండరు తేది నాడు ప్రభుత్వము వారు సెలవు దినముగా ప్రకటించిన యెడల మరుసటి రోజు కార్యాలయము పని చేయు వేళలో స్వీకరించబడును.

వ.నెం.	టెండరు వివరములు	టెండరు ధరావత్తు రూ.
1.	ఎలక్ట్రీషియన్-1 (నెలకు)	100/-
2.	స్వీపర్లు-2 (నెలకు)	100/-
3.	గేటువాల్వు ఆపరేటర్లు-2 (ఒక్కరికి)	100/-
4.	ట్రాక్టర్ డ్రైవర్-1 (ఒక్కరికి)	100/-

నకలు పంచాయితీ కార్యాలయము నోటీసు బోర్డు నందు అతికించడమైనది. నకలు మండల పరిషత్ కార్యాలయము, నెల్లూరు రూరల్ మండలము వారికి సమాచార నిమిత్తము సమర్పించడమైనది.

పంచాయతీ కార్యదర్శి, కాకుపల్లి గ్రామ పంచాయితీ

కలివెలపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయము

ఆర్.ఓ.సి. నెం: 01/2024 — **టెండరు నోటీసు** — తేది 15.02.2024

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరురూరల్ మండలము కలివెలపాలెం గ్రామ పంచాయితీ పరిధిలో 12 నెలల కాలము అనగా తేది: 01-04-2024 నుండి 31-03-2025 వరకు గ్రామ పంచాయితీ నందు వివిధ సేవలు నిర్వహించుటకు గ్రామ పంచాయతీకి సిబ్బందిని ప్రతిరోజు పంపవలెను. సదరు సేవల మీద సిబ్బందిని పంపుటకు ఆసక్తి ఉన్న కాంట్రాక్టరు గ్రామ పంచాయితీ నందు టెండరు దాఖలు చేయవలెను. సదరు టెండర్లు దాఖలు తేది 21.02.2024 ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 03.00 వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడును. మరియు అదే రోజు మధ్యాహ్నం గం॥3.00 గంటలకు హాజరైన టెండరు దారుల సమక్షములో సీల్డు టెండర్లు తెరవబడును. టెండర్లు దాఖలు చేయువారు. ఈ క్రింది తెలిపిన విధముగా నిర్ణీత ధరావత్తు పంచాయితీ కార్యాలయములో చెల్లించి రశీదు పొంది, టెండరు షెడ్యూలును ఆతవరలి టెండరు దాఖలు చేయవలెను. షరతులు వర్తించును పై టెండర్లు ఆమోదము తెలుపుటకు తుది నిర్ణయము పంచాయితీ వారిది. టెండరు తేది నాడు ప్రభుత్వము వారు సెలవు దినముగా ప్రకటించిన యెడల మరుసటి రోజు కార్యాలయము పని చేయు వేళలో స్వీకరించబడును.

వ.నెం.	టెండరు వివరములు	టెండరు ధరావత్తు రూ.
1.	ఎలక్ట్రీషియన్-1 (నెలకు)	100/-
2.	స్వీపర్లు-1 (నెలకు)	100/-
3.	గేటువాల్వు ఆపరేటర్లు-3 (ఒక్కరికి)	100/-

నకలు పంచాయితీ కార్యాలయము నోటీసు బోర్డు నందు అతికించడమైనది. నకలు మండల పరిషత్ కార్యాలయము,నెల్లూరు రూరల్ మండలము వారికి సమాచార నిమిత్తము సమర్పించడమైనది.

పంచాయతీ కార్యదర్శి, కలివెలపాలెం గ్రామ పంచాయితీ